# పండిత పుత్రులు

రామయ్య సిద్ధాంతి మహా పండితుడు. సమస్త శాస్త్రాలు చదివేడు; కాని తిండిలేదు. దారిద్ర్యం ఆయన్ని పట్టుకు బాధిస్తోంది. ఆయనకి ఇద్దరు కొడుకులు. వారిద్దరూ పండిత పుత్రులైనందుకు పండిత పుత్రులే!

ఒకరోజున రామయ్య సిద్ధాంతి విజయనగరం ప్రయాణ అయ్యేడు అక్కడ రాజుగారు పండిత సభ చేస్తున్నారని విని, మెల్లగా కాళ్లు యీడ్చుకుంటూ విజయనగరం చేరుకున్నాడు.

రాజసభ పండితులతో నిండి, పెళ్లి వారి యిల్లులాగ కలకల లాడుతోంది. రామయ్య చింకి అంగవస్త్రం కట్టుకొని ఒకమూల కూర్చున్నాడు. రాజుగారు సభాసదులను చూచి ఒకసమస్య యిచ్చి పూరణం చేయమన్నారు. పండితులందరూ సమస్య విని, దిగాలుపడి ఒకరి మొఖం ఒకరు చూచుకొంటున్నారు.

మూల కూర్చున్న రామయ్య మెల్లగా ముందుకు వచ్చి రాజును దీవించి, క్షణంలో సమస్యను పూరించేశాడు. దాంతో రాజుగారికి పట్టరాని సంతోషం కలిగింది. రామయ్యను తగిన రీతిని గౌరవించారు. ఆనాటి సభ అంతటితో పూర్తి అయిపోయింది. ఎవరి ఇండ్లకు వారు వెళ్లిపోయారు.

రామయ్య బహుమానం అందుకొని మెల్లగా నడిచి వస్తూవుండగా దారిలో పేరయ్య సిద్ధాంతి, అనే ఆయన ఎదురై రామయ్యను కుశల ప్రశ్నలువేసి, ఆరోజున తనయింట ఆతిధ్యం స్వీకరించ వలసిందిగా కోరాడు. రామయ్య సిద్ధాంతి అందుకు వొప్పుకున్నాడు. భోజనాలు అయిపోయినాయి. పేరయ్య సిద్ధాంతి తన ఇద్దరు కూతుళ్లనూ, రామయ్య ఇద్దరు కొడుకులకీ యిచ్చి వివాహం చేసి వియ్యమందకో దలిచానని సవినయంగా చెప్పాడు. రామయ్య ఆలోచించి “తథాస్తు” అనేశాడు.

అనుకున్నమాట ప్రకారం పెళ్లిళ్లు జరిగాయి. కొంత కాలానికి రామయ్య సిద్ధాంతి పరమ పదించాడు. ఇంటి బాధ్యత యీ చవటలమీద పడింది. వీళ్ల భార్యలైనా తెలివైన వాళ్లు అవడంచేత సంసారం గుట్టుగా సాగిపోతున్నది. ప్రతీ రోజూ ఇద్దరు అన్నదమ్ములూ చద్ది అన్నం తినడం, వీధిలో చేరి ఒక అరుగుమీద కూర్చొని, ‘ఊరిపిండి వడియం బాగుంద’ని ఒకడు, ‘ఉల్లిపాయ పకోడీ బాగుందని’ ఒకడు-యిలాగు ఇద్దరూ వంటకాల గురించి చర్చించడం, తిరిగి, మధ్యాహ్నం వేళకి భోజనం చేసి నిద్రపోవడం – ఇదీ వాళ్ల దినచర్య!

ఒకరోజున వాళ్ల భార్యలు భర్తలను పిలిచి “తండ్రిగారి సంవత్సరీకాలకి కావలసిన దినుసులు తెచ్చినా సరే, లేదా విజయనగరం వెళ్లి రాజుగారి నడిగి వార్షికం తెచ్చినా సరే” అని హెచ్చరించారు.

అన్నదమ్ము లిద్దరు అరుగుపైన కూర్చొని విజయనగరం ప్రయాణం గూర్చి యోచిస్తూన్నారు. ఇంతలో చిన్నవాడు “ఒరే! అన్నయ్యోయ్! నాకు ఒక ఉపాయం తోస్తోందిరోయ్!.... ఈ గుర్రం ఉందే, మనగుర్రం... ఇది విజయనగరం గుర్రంరా! మనం గనక దానిమీద కూర్చున్నామా అంటే అది తిన్నగా మనల్ని విజయనగరమే తీసుకొని పోతుందిరా” అన్నాడు.

ఆ అన్నయ్య యీ తమ్ముడు తెలివికి మెచ్చుకొని, ఇద్దరూ రెండు కంచాల చద్ది అన్నం తిని, రాజుగారిచ్చిన చెమికీకోట్లు రెండు అంగవస్త్రాల్లో మూటకట్టుకొని, గుర్రం ఎక్కేరు. ఎన్నాళ్ల నుంచో కట్టు

# పండిత పుత్రులు

విప్పక పోవడంచేత, రాజుగారి గుర్రం కాళ్లగుంట్లు తీరేటట్టు తిరిగి తిరిగి, సాయంకాల మయ్యేసరికి, మళ్లీ ఇంటిముఖమే పట్టింది.

సాయంకాలం కావచ్చింది, చిమచిమ చీకటి పడుతోంది. చిన్నవాడు మెల్లగా "ఒరే! అన్నాయ్! ఇది మన ఊరి పొలిమేరలాగే ఉందిరా?" అన్నాడు. "ఊరుకోరా తమ్మయ్యా; అన్ని వూళ్లకీ పొలిమేరలు ఒక్కలాగే వుంటాయి. ఇది విజయనగరం పొలిమేరేలేరా!" అన్నాడు.

గుర్రం తిన్నగా వాళ్ల ఇంటి ముందుకే వెళ్లి ఆగింది. చిన్నవాడు "ఒరే! అన్నాయ్! ఇది మన ఇల్లులాగే ఉందిరోయ్?" అన్నాడు "ఛీ! ఊరుకో, ఇది మన నాన్నగారు విడిదిచేసిన పూటకూళ్ల ఇల్లు ఐవుంటుంది. మన గుర్రం చూశావా-ఎంత గమనంగా మన నిక్కడికి తీసుకు వచ్చిందో. పద పద లోపలికిపోయి యింత తిని పడుకుదాం" అన్నాడు పెద్దాయన.



గుర్రాన్ని చెట్టుకు కట్టి, తలుపు తట్టి"ఏమండోయ్, ఎవరు ఇంట్లో?" అంటూ యిద్దరూ కలిసి పొలికేకలు పెట్టారు. అక్కా చెల్లెళ్లు నవ్వుకుంటూ, తలుపు దగ్గరకు వచ్చి చూశారు. చిన్నది "మన పండిత పుత్రులు? అక్కా! చూచావా వార్షికం లేదు, చట్టు బండలూ లేదు" అంది. "అది సరే కానీ వీళ్లను తమాషా చేద్దామా" అంటూ ఇద్దరూ తలుపు తీసి. ఎవరు నాయనా మీరు" అని ప్రశ్నించారు.

"మేమా? మేమెవరమో మా మొఖాలు చూస్తేనే తెలియటం లేదూ - రామయ్యసిద్ధాంతి కుమారులం! వార్షికానికి వచ్చేం" అన్నారు.

"పాపం! మీరే వచ్చేరేం? సిద్ధాంతిగారు రాలేదూ" అన్నారు అడవాళ్లు.

"వారు కాలం చేసేరు! అందుకని మేమే రాకతప్పింది కాదు" అంటూ ఒకరి ముక్కు. ఒకరు చీదేశారు. "అల్లాగా పాపం!..సరే లేవండి చాలప్రొద్దుపోయింది; భోజనం చేద్దురుగాని" అన్నారు ఆ ఆడంగులు.

ఇద్దరన్నదమ్ములూ బట్టలు సర్దుకొని, కాళ్లు కడుక్కొని భోజనం చేస్తున్నారు. చిన్నామె వడ్డిస్తోంది. చిన్నవాడు ఆమెకేసి కొంతసేపు పరీక్షగా చూసి, మెల్లగా అన్నగారితో "ఒరే! అన్నాయ్! ఇది నా పెళ్లాంలాగే ఉందిరా?" అన్నాడు.

"ఛీ! ఉరుకో, వాళ్లు వింటె

(43-వ పేజీ చూడండి)

# పండిత పుత్రులు

(36-పేజీ తరువాయి)

తంతారు! కన్పించిన ఆడదల్లా 'నా పెళ్లాం' అంటే బాగుంటుందా?" అన్నాడు పెద్దాడు.

ఇంతలో పెద్దాదివిడ వచ్చి "ఏమి కావాలి" అని అడిగింది. చిన్నవాడు మరి ఊరుకోలేక పోయేడు. మెల్లగా అన్నతో "ఒరే అన్నాయ్ నేను అంటే నమ్మవు కానీ యీమె నిజంగా మీ ఆవిడలాగే ఉందిరా" అన్నాడు. "మళ్లీ ప్రారంభించేవూ? ఊరుకో రాబాబూ అంటే! నీతో ఉంటే దెబ్బలు కూడా తినాలి కాబోలు, ఊరుకోరా నాయనా" అన్నాడు పెద్దాడు.

భోజనం అయిపోయింది. అన్నదమ్ములకు ఒక గది చూపేరు పడుకోమని. పగలల్లా గుర్రం మీద ప్రయాణం చేయడంచేత, యిద్దరికీ, వళ్లు అంతా హూనమయి పోయింది. తిండి తినగానే నిద్ర వచ్చింది. పడుకున్నారు. అక్కా, చెల్లెళ్లు పని పాటలు పూర్తిచేసుకొని, ఎవరి గదిలో వారు పండుకున్నారు.

రాత్రి చిన్నవాడు రాజుగారి దగ్గర బహుమానం పుచ్చుకుంటున్నట్లు కలకన్నాడు. ప్రక్కనున్న భార్యను లేపేస్తున్నాడు, అన్న అనుకొని "ఒరే! అన్నాయ్! ఇదిగో, బహుమానం! నీవుపో, నీకూ ఇస్తారు" అంటూ కేక లేస్తున్నాడు. రెండవ గదిలో పెద్దాడు కూడా అలాగే కేక లేస్తున్నాడు.

ఈ కేకలకి పొరుగింటి వాళ్లు లేచి "వీళ్లకు పిచ్చిఎత్తిందా ఏమిటి? అర్ధరాత్రి యీలా కేక లేస్తున్నారు!" అంటూ నంగతి కనుక్కోడానికి వీళ్ల ఇంటికొచ్చి తలుపు తట్టారు.

అన్నదమ్ములు కళ్లు నులుపుకోని, తలుపు తీసేరు. ఎదురుగా పొరుగింటివారు, యిరుగింటి వారు, ప్రత్యక్షమయ్యేరు. చిన్నవాడు "ఓహో! అప్పయ్య శాస్త్రి, అదిగో గోపయ్య సిద్ధాంతి!! మీ రెప్పుడు వచ్చారు, విజయనగరానికి? మీక్కూడా వార్షికం వుందా ఏమిటీ" అని పలకరించేడు.

వీళ్ల చర్యలకు ఆయిరుగు పొరుగుల వాళ్లు నవ్వుకొని. "ఊరుకోండోయ్, వాజమ్మలూ! మీయిల్లు ఏమిటి! మీ భార్యలు ఏమిటి! విజయనగరం అంటారు ఏమిటి? మీ తెలివి ఏడిసినట్టే ఉంది, ఊరుకోండి, ఇక నోరు కదిపేరా తన్నులు తింటారు జాగ్రత్త!!" అంటూ నాలుగు చీవాట్లు పెట్టేరు.

ఇద్దరన్నదమ్ములు మర్నాడు వుదయం లేచి భార్యలు శుభ్రంగా తోమియిచ్చిన రాగిచెంబులు, చేత పట్టుకొని వూరుమీదకు పోయారు యాచనకి!

# జంతుకోటిలో మానవలక్షణాలు

(32-వ పేజీ తరువాయి)

వెయ్యటం యీకల పక్షులుకికిట్టదు. అలాగే యీస్కాన్క్ వేసిన వేషాలు ఆకోడి పెట్టకీ కిట్టలేదు. దాని పిల్లలని అది తీసుకొని దూరంగా పోయింది.

పక్షుల పిల్లలు సహజంగా వాటి తల్లుల నీడల్లోనే నడుస్తూ వుంటాయి. అనేకమంది వ్యక్తులు పిట్టలువాటంతట అవే తమని అనుసరించేలా చేసుకోవాలని చాలా విధాల ప్రయత్నించారు.

డాక్టర్ కన్రాడ్ లోరెన్జ్ అనే ఆయన బాతుఒకటి గుడ్లు పెట్టగానే వాటిని పట్టుకుపోయి, వేరే విధంగా వాటిని పొదిగించాడు. అవి పిల్లలు అయి, కళ్లు తెరిచిన క్షణంనుంచీ, తాను తప్పితే కదిలే ప్రాణి మరేది వాటికి కనుపించకుండా జాగ్రత్త పడ్డాడు. ఆకారణం చేత అవి ఎంతసేపూ ఆయననే అంటిపెట్టుకు తిరగటం మొదలెట్టాయి. ఒకనాడాయన వాటిని కాలవ గట్టుదాకా నడిపించుకు పోయి, అక్కడ తాను మాత్రం గభిక్కని ఒక బోటులో దూకి, బోటు నడిపించుకు పోతూ, వెనక్కి, తిరిగిచూస్తే, యీ అరడజను బాతులూ వరస దీరి తన వెన్నంటే వస్తున్నట్లుచూసి మురిసి పోయాడు.

ఇంకా తమాషాచేసి చూద్దామని ఆయన ఒకరోజు వాటిని వెంటబెట్టుకు నడిపించుకు పోయి పోయి, ఎక్కడో ఒకచోట ఒక చిన్న విమానంలోకి ఎక్కికూర్చుని గాలిలోకి తేలిపోయాడు. కొంత దూరంపోయి వెనక్కి తిరిగిచూస్తే యీబాతులూ గాలిలో వరుసతీరి యీయన వెనకాలే ఎగురుతున్నాయట!

(ఇంకావుంది)